మీ సేవలు ఎనలేనివి

పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులకు ఆత్మీయ సత్కారాలు



మస్తానప్పను సత్కరిస్తున్న విభాగాధిపతి పాండే, కార్మిక నాయకులు

సుదీర్ఘ కాలం సేవలు అందించి శుక్రవారంతో పదవీ విరమణ చేస్తున్న పలువురు ఉద్యోగులను గురువారం ఘనంగా సత్కరించారు. సమస్యల పరిష్కారంలో వారు చూపిన సేవలను కొనియాడారు.

మస్తానప్ప సేవలు ఆదర్శం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై అవగాహన కలిగిన నాయకుడు మస్తానప్ప అని స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ విభాగాధిపతి ఎస్.కె.పాండే అన్నారు. సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ ప్రశంసనీయమన్నారు. స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప శుక్రవారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఇంజినీరింగ్ షాప్స్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జరిగిన సత్కార సభలో పాండే ప్రసంగించారు. కార్మికుల సమస్యలపై నిత్యం అధికారులను కలిసి, వాటి పరిష్కారానికి మస్తానప్ప కృషి చేసేవారన్నారు. నేటి నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సన్మాన గ్రహీత మస్తానప్ప మాట్లాడుతూ ప్లాంట్‌లోని అన్ని విభాగాల అధికారులతో ఉన్న సన్నిహిత సంబంధాల వల్ల కార్మికుల సమస్యల పరిష్కారంలో అందరి సహకారం లభించేదన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు వై.టి.దాస్, ఎం.ఎస్.రెడ్డి, దేముడు, జె.శ్రీనివాస్, అప్పలరెడ్డి, సాంబశివరావు, బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయం

హెచ్‌ఆర్ విభాగ ఉద్యోగి సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ కె.సంజీవరావు కొనియాడారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్న నాద్లె సూర్యనారాయణ అభినందన సభను ఉక్కు హెచ్‌ఆర్ విభాగంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో జీఎం మాట్లాడుతూ ఒప్పంద కార్మిక విభాగంలో సమస్యల పరిష్కారంలో ఆయన విలువైన సేవలు అందించారన్నారు. హెచ్‌ఆర్ ఉద్యోగినులు ప్రియాంక పాఠక్, మధు బిందు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.



స్టేషన్ సూపరింటెండెంట్ ఎస్.ఆర్.కె.రావును సత్కరిస్తున్న స్టేషన్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు



సత్కార కార్యక్రమంలో ప్రసంగిస్తున్న హెచ్‌ఆర్ జీఎం సంజీవరావు

స్టేషన్ మాస్టారుకు ఘన సత్కారం

అగనంపూడి: ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న దువ్వాడ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఎస్.ఆర్.కె.రావును దువ్వాడ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు, అగనంపూడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ ఎస్‌ఆర్‌కే రావు వివిధ హోదాల్లో 37 సంవత్సరాల పాటు సుదీర్ఘమైన సేవలు అందించారన్నారు. సన్మాన గ్రహీత ఎస్‌ఆర్‌కే రావు మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో నాలుగేళ్ల పాటు ఇక్కడ మేనేజర్‌గా విధులు నిర్వహించానన్నారు. నాయకులు ఎ.శంకరరావు, విందుల వరహాలు, స్టేషన్ సిబ్బంది శ్రావణ్‌కుమార్, చంద్రశేఖర్, నాగరాజు, స్వామి పాల్గొన్నారు.

ముగిసిన ముగ్గురమ్మల నవరాత్రి మహోత్సవాలు

వైభవంగా బంగారుమాంబ అనుపోత్సవం



బంగారుమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవతలైన బంగారుమాంబ, నూకాంబిక, దుర్గాలమ్మ వార్ల నవరాత్రి పండగ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగ్గురమ్మ వార్ల ఉత్సవాలను ఈ నెల 22 నుంచి కనులపండువగా జరిపించారు. ముగ్గురమ్మ వార్లతో పాటు గ్రామంలో కొలువైయున్న సత్తెమ్మ తల్లికి కూడా పూజలు చేశారు. నిత్యం కుంకుమార్చనలు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, పండగ సంబరాలతో నాతయ్యపాలెం గ్రామంలో తొమ్మిది రోజుల పాటు పండగ సందడి నెలకొంది. ఉత్సవాల ముగింపు సందర్భంగా బంగారుమాంబ అమ్మవారిని గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రాత్రి ముగ్గురమ్మల ఘటాలను వీధుల్లో ఊరేగించారు. సాము గరిడీ, తప్పెట గుళ్లు, స్టేజి సెట్టింగ్‌తో ప్రధాన దేవత బంగారుమాంబ అమ్మ వారి అనుపోత్సవం జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది.



దుష్టశక్తులు వాలకుండా సత్తెమ్మ తల్లి ఘటాన్ని కర్రలతో కాపలా కాస్తూ, ఊరేగిస్తున్న భక్తులు

సంతోషిమాత ఆలయానికి మైక్ సెట్ వితరణ

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని సంతోషిమాత ఆలయానికి 72వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాస్ గౌడ్ రూ. 12వేలు విలువ గల మైక్ సెట్ బహూకరించారు. దానిని ఆలయ అర్చకుడు శ్రీనివాస శర్మకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



అర్చకుడికి మైక్ సెట్ అందిస్తున్న సిరట్ల శ్రీనివాస్

కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: స్థానిక పాతకర్ణవానిపాలెం గ్రామదేవతలు పైడితల్లి, దుర్గమాంబ అమ్మవార్ల పండగ సందర్భంగా పలువురు కళాకారులను కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు ఘనంగా సత్కరించారు. శ్రీనగర్‌కు చెందిన కొరియోగ్రాఫర్ రమేష్ మాస్టర్, పల్సర్ బైక్ గాయకుడు రమణ, డ్యాన్స్ మాస్టర్ బాలు తదితరులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో కరణంరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుని సమస్యలపై ఆర్‌ఎల్‌సీ జోక్యం

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 29 ఏళ్ల పాటు క్యాజువల్ కార్మికునిగా విధులు నిర్వహించిన శరగడం రామారావును ట్రై పార్టీ ఒప్పందం మేరకు పర్మినెంట్ చేయకపోవడం, కనీస వేతనం చెల్లించకుండా అన్యాయానికి గురిచేయడం, సాంఘిక భద్రతా పింఛన్ చెల్లింపులో అడ్డంకులు సృష్టిస్తున్న యాజమాన్యం తీరుపై ప్రాంతీయ కార్మిక శాఖ అధికారి (ఆర్‌ఎల్‌సీ) స్పందించారు. ఉక్కు యాజమాన్యం మూడు రోజుల్లో స్పందించి సరైన సమాధానం ఇవ్వాలని ఆర్‌ఎల్‌సీ నోటీసులు జారీ చేసినట్టు సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు పేర్కొన్నారు.

18న పైడితల్లి అమ్మవారి పండగ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి వార్షిక పండగను వచ్చే నెల 18వ తేదీ మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పూజారి వంశీయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లండ వెంకటరమణ ప్రకటించారు. అమ్మవారి పండగ నిర్వహణకు సంబంధించి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణ, అడవివరం గ్రామస్తులు, అమ్మవారి సేవకులతో గురువారం సింహాచలం దేవస్థానం అధికారులు సమావేశం నిర్వహించారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ జూన్ 9న అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మ(మరిడమ్మ) పండగ, 10వ తేదీన పైడితల్లి, ముత్యాలమ్మ తల్లి అమ్మవార్ల దేవర (పుట్టమన్ను) తెచ్చే కార్యక్రమం, 11వ తేదీన ముత్యాలమ్మ పండగ జరపనున్నట్లు తెలిపారు. 17న పైడితల్లి అమ్మవారి తొలేళ్ల మహోత్సవం, 18వ తేదీన పైడితల్లి పండగ మహోత్సవం(అనుపు), 25న మారువారం పండగ జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

ఘనంగా సిటూ ఆవిర్భావ దినోత్సవం



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



భెల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

అక్కిరెడ్డిపాలెం: సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. సంస్థ సీనియర్ కార్మికుడు, సిటూ నాయకుడు కె.శ్యామ్ సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. సిటూ సీనియర్ నాయకుడు ఎస్.జగన్నాథరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సిటూ వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తూ, పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.టి.వి.ప్రకాష్ మాట్లా డుతూ కంపెనీ పరిరక్షణ, భెల్‌లో విలీ నం కోసం తమ యూనియన్ ఎన్నో పోరాటాలు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఉరుకూటి బాబూరావు, పీవీఎస్ రాజు, కొల్లి దేముడు, వారాడ ఆనందరావు, ఆర్.ఆర్.నాయుడు, వై.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలను బలపరుద్దాం

ఉక్కునగరం: కార్మికుల ఐక్య ఉద్యమాలను బలపరుద్దామని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద గురువారం యూనియన్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, కృష్ణమూర్తి, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

కథలతో విజ్ఞానం, వికాసం



విద్యార్థులకు కథలు వివరిస్తున్న ఉపాధ్యాయుడు వరప్రసాద్

పెదగంట్యాడ: విజ్ఞానాన్ని నమూపార్జించే కథలను విద్యార్థులు బాగా చదవాలని స్థానిక ఉపాధ్యాయుడు వరప్రసాద్ అన్నారు. ఈ పుస్తకాలను చదవడం వారిలో విజ్ఞానం పెంపొందడంతో పాటు వ్యక్తిత్వ వికాసం వృద్ధి చెందుతుందన్నారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు కథలను బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాల్లో కథలు చదివితే వాటిలోని నీతి అర్థమవుతుందని, అలాగే మన నడవడిక బాగుంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ఆటలు ఆడించారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నవ్య, కుమారి, రాధిక తదితరులు పాల్గొన్నారు.



అణువణువూ తనిఖీ

రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా



గాజువాక హైస్కూల్ రోడ్డులో పర్యటిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: పోలీసులు అణువణువూ పరిశీలిస్తున్నారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో ముందుగానే తనిఖీలు చేపడుతున్నారు. గాజువాకలోని హైస్కూల్ రోడ్డు, జోగువానిపాలెం పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ ప్రాంతాల్లో పలువురు పాత నేరస్తులు, రౌడీ షీటర్లను సమావేశపరిచి, వారికి పలు సూచనలు చేశారు. వారిపై బైండోవర్ పెట్టారు.

సమస్యాత్మక ప్రాంతాల పరిశీలన

కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండటంతో సమస్యాత్మక ప్రాంతాల్లో పలువురు పాతనేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామని డీసీపీ-2 మేకా సత్తిబాబు, సౌత్ ఏసీపీ త్రినాథ్ పేర్కొన్నారు. కౌంటింగ్ రోజు, ముగిసిన తర్వాత, ముందు రోజు బాణసంచా కాల్చరాదన్నారు. డీజే సౌండ్లు, ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా, మద్యం వంటివి నిల్వ ఉంచకూడదని చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ సూచనల మేరకు సమస్యాత్మక ప్రాంతాల్లో కౌంటింగ్ అయ్యేవరకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బొమ్మన బ్రదర్స్ ఎదురుగా గల గాజువాక హైస్కూల్ రోడ్డు నుంచి జోగువానిపాలెం, పంతులుగారి మేడ వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. స్థానికులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గాజువాక, స్టీల్‌ప్లాంట్, దువ్వాడ సీఐలు, 5 గురు ఎస్‌ఐలతో పాటు సుమారు 45 మంది సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడావిజేతలకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అభినందించారు. స్టీల్‌ప్లాంట్, పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక క్రీడాకారులు అనేక మంది స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో కల్నల్ సీకే నాయుడు స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తూ అనేక పతకాలు సాధించారు. 2023–24 సంవత్సరంలో టాటానగర్‌లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ స్టీల్ బాక్సింగ్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. చైనాలో జరిగిన 19వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ముగ్గురు స్కేటింగ్ క్రీడాకారులు బంగారు పతకాలు గెలుపొందారు. అదే విధంగా బొకారోలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ స్టీల్ కబడ్డీ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ క్రీడాకారులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా గురువారం ఉక్కు పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, పలువురు కోచ్‌లు పాల్గొన్నారు.









చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నీలం శ్రీనివాస్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌ఈఎల్ సిగ్నల్ పాయింట్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వాహనచోదకుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వివరాలివి.. బుధవారం రాత్రి నాతయ్యపాలెం నుంచి భెల్ సిగ్నల్‌పాయింట్ వైపు సర్వీస్‌రోడ్డులో వెడుతున్న ఓ వ్యక్తిని హోండా యాక్టివాతో నీలం శ్రీనివాస్ (57) ఢీకొట్టారు. దీంతో వాహనం అదుపుతప్పి పడిపోవడంతో వాహనచోదకుడు శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య సువర్ణ రాణి హైదరాబాద్‌లోని ఎస్‌బీఐలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మృతుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులోని మూసాపేటలో నివాసం ఉంటున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు శ్రీనివాస్ వ్యాపార నిమిత్తం విశాఖ వచ్చారని, చినముషిడివాడలో తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పాదచారుడిని ఢీ కొట్టినట్లు గాజువాక ట్రాఫిక్ పోలీసులు తమకు సమాచారం ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల ఏరివేత

సాక్షి ఎఫెక్ట్..



కుక్కలను పట్టుకుంటున్న జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు రాజీవ్‌నగర్ ఫేజ్-1లో కుక్కల నియంత్రణకు జీవీఎంసీ చర్యలు చేపట్టింది. ఈ ప్రాంతంలో కుక్కలు, పందుల సంచారంతో పాటు వృద్ధులు, బాలలపై దాడులకు పాల్పడుతున్నాయని వుడా కాలనీవాసులు సాక్షి దృష్టికి తీసుకురావడంతో పాటు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సాక్షి దినపత్రికలో 'బెంబేలెత్తిస్తున్న కుక్కలు, పందులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ అధికారులు కుక్కల వాహనంతో పాటు సిబ్బందిని పంపించి, కుక్కలను పట్టుకుని తరలించారు. కుక్కల ఏరివేత చేపట్టిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. పందుల ఏరివేత కూడా చేపట్టాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.





'కేంద్రం కుయుక్తులు చెల్లవు'



దీక్ష శిబిరంలో పాల్గొన్న మస్తానప్ప, ఆదినారాయణ, శ్రీనివాసరావు తదితరులు

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా చెల్లవని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు వై.మస్తానప్ప, డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు అన్నారు. వాటిని అడ్డుకునే శక్తి ఆంధ్రులకు ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 1204వ రోజు, గురువారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ ప్రభావం ఉత్తరాదిలో తగ్గుతోందన్నారు. కేవలం కేంద్రం అనుసరించే కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలే బీజేపీ ప్రభుత్వ పతనానికి నాంది కానున్నాయన్నారు. దేశానికి ఆయువుపట్టు లాంటి ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయడం అంటే కూర్చున్న చెట్టును నరికేయడంతో సమానమన్నారు. విశాఖ ఉక్కును ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా, పడిలేచే కెరటంలా ఉక్కు కార్మికులు వాటిని రక్షించుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దేవులపల్లి సంపూర్ణం, ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



